క్లుప్తంగా

ప్రశాంతంగా గురుకుల సీఓఈ ప్రవేశపరీక్ష

మరికల్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన గురుకుల సీఓఈ ప్రవేశపరీక్ష ప్రశాంతంగా జరిగిందని ప్రిన్సిపాల్ అనురాధ తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన ఈ పరీక్షకు 600 మంది విద్యార్థులకు గానూ 585 మంది హాజరయ్యారని వివరించారు.

ఆర్థిక సాయం

ఊట్కూరు: గ్రామానికి చెందిన ఆంజనేయులు మృతిచెందడంతో అంత్యక్రియల నిమిత్తం మేస్త్రీ సంఘం సభ్యులు రూ.13 వేలు బాధిత కుటుంబానికి అందించారు. ఆంజనేయులు కుటుంబాన్ని వారు పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సంఘం అధ్యక్షులు నాగేశ్, నాయకులు లింగప్ప, భాస్కర్, కుమ్మరి లక్ష్మయ్య, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ వైర్ చోరీ

మరికల్: పంచాయతీకి సంబంధించిన తాగునీరు అందించే బోరు కేబుల్ వైర్ శనివారం రాత్రి చోరీకి గురైంది. పశువైద్యశాల దగ్గర ఉన్న తాగునీటి బోరుకు స్టార్టర్‌కు మధ్యన 30 మీటర్ల వైరు గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారని చోరీ చేసిన వారి సమాచారం అందిస్తే రూ. 5 వేల నగదు అందజేస్తామని కార్యదర్శి శ్రీనివాస్‌రావు తెలిపారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

అమరచింత: పట్టణంలోని సయ్యద్‌షా రాజవళి దర్గా షరీఫ్‌లో ఆదివారం దర్గాలో ట్రేడ్ యూనియన్ రాష్ట్ర మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం దర్గా కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు. దర్గా అభివృద్ధికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు షానవాజ్ ఖాన్, షాహిన్ రఫి, ఖాజామైను, తౌఫిక్, ఇంతియాజ్, ఫరీద్, కలాంపాషా, మోహిన్, తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

పాలమూరు: సీనియర్ సిటిజన్ ఫోరం తరుపున చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని ముడా చైర్మన్ గంజి వెంకన్న ముదిరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పారిశ్రామిక వాడలో గల ఫోరం కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతున్న గత కొన్ని రోజుల నుంచి సీనియర్ సిటిజన్ ఫోరం నుంచి అన్నదానం, దుప్పట్ల పంపిణీ, ఉచిత వైద్య శిబిరాలు, చలివేంద్రాలు, రోగులకు సేవలు లాంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఫోరం అధ్యక్షుడు జగపతిరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక సేవా భావంతో మెలిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. అశోక్, సిద్దిరామప్ప, జయరాం పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు

ఆత్మకూర్: పట్టణంలోని బీసీకాలనీలో రోడ్లు గుంతలమయంగా మారడంతో కాలనీవాసుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మాజీ వార్డు సభ్యుడు గద్దమీది శ్రీనివాసులు రోడ్డుకు మరమ్మతు చేయించారు. రూ.50 వేలు వెచ్చించి కాలనీవాసులు సౌకర్యార్థం ఆదివారం మొరం మట్టి వేశారు. త్వరలోనే రూ. 30 లక్షలతో 6వవార్డులోని బీసీ కాలనీలో సీసీరోడ్ల నిర్మాణాలు చేపడుతామని పేర్కొన్నారు.

ఇష్టానుసారంగా చెరుకు తరలిస్తే చర్యలు

ఆత్మకూర్: ఇష్టానుసారంగా చెరుకును తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ పుట్ట మహేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమయపాలన పాటించకుండా ట్రాక్టర్ల ద్వారా చెరుకును తరలించి ట్రాఫిక్‌కు అంతరాయం కల్పిస్తే జరిమానా విధిస్తామన్నారు. రాత్రి 8–30 గంటల తర్వాతనే ఆత్మకూర్ మీదుగా తరలించాలని లేనిపక్షంలో రూ.2వేలు జరిమానా విధించి ట్రాక్టర్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

ఆత్మకూర్: రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం చిన్నచింతకుంట మండలం ఉంద్యాల గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ దయాకర్‌గౌడ్, మాజీ సర్పంచ్ సుజాత దంపతులు ద్విచక్రవాహనంపై ఆత్మకూర్‌కు వెళ్తున్నారు. స్థానిక మార్కెట్ యార్డు ఎదుట పందులు అడ్డురావడంతో వీటిని తప్పించేక్రమంలో బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ఘటనలో దంపతులకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను హైదరాబాద్‌కు తరలించారు.

అందరి సహకారంతో అభివృద్ధి సాధ్యం

అమరచింత: అందరి సహకారంతో అభివృద్ధి సాధ్యమని మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ కౌన్సిలర్‌లతో కలిసి ఆయన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ డీఎంఆర్ఎం ట్రస్టు ద్వార తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ నాగభూషణం గౌడ్ పాల్గొన్నారు.

నిఘానేత్రాలపై నిర్లక్ష్యం

- పనిచేయని సీసీ కెమెరాలు
- నిర్వహణ అస్తవ్యస్తం



మాగనూర్ పోలీస్‌స్టేషన్‌లో సీసీ టీవీ పర్యవేక్షణ విభాగం



అంబేడ్కర్ చౌరస్తాలో సీసీ కెమెరాలు

మాగనూర్: మండలంలో ఆయా చోట్ల ఏర్పాటు చేసిన నిఘానేత్రాలు అలంకార ప్రాయంగా మారాయి. ముఖ్యంగా మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల్లో చాలావరకు పనిచేయడం లేదు. నిర్వహణలోపంతో పాటు, అభివృద్ధిపనులు, కోతుల బెడద వంటి అనేక అంశాలు సీసీ కెమెరాలు పనిచేయకపోవడానికి కారణమవుతున్నాయి. ముఖ్యంగా కోతుల దాడులో వైర్లు తెగిపోయి సీసీ కెమెరాలు పని చేయడం లేదు. దీంతో వాటి మరమ్మతులు నిర్వహణ పోలీసు శాఖకు భారంగా మారుతోంది. మండల కేంద్రంలో బస్టాండ్ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, ఇండియన్‌గ్యాస్ దగ్గర సీసీ కెమెరాలు ఉన్నాయి. మిగత కూడళ్ల వద్దా కెమెరాలు ఉన్నప్పటికీ పనిచేయడం లేదు. కాగా ప్రధాన చౌరస్తాతో పాటు వర్కూర్, కొత్తపల్లి క్రాస్‌రోడ్డు తదితర చోట్ల కెమెరాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. కమ్యూనిటీ పోలీసింగ్ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. పోలీసులకు నేరపరిశోధనలో ఇవి ఎంతగానో తోడ్పడుతున్నాయి.

అయితే ప్రభుత్వం నుంచి సీసీ కెమెరాల ఏర్పాటు, నిర్వాహణకు నిధుల కేటాయింపు లేకపోవడం పోలిసుశాఖకు తలనొప్పిగా మారింది. కెమెరాలు పనిచేయకపోవడం దొంగతనాలు చేసేవారి పాలిట వరమైంది. ఇటీవల నల్లగట్టు మారెమ్మవ్వ సమీపంలో మేకల దొంగతనం, మోటార్ల చోరీ వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. కెమెరాలు పనిచేయకపోవడంతో పోలీసులు దొంగతనం చేసినవారిని పట్టుకోవడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో ఇప్పటికైనా నిఘానేత్రల నిర్వహణ సరిగా చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


రెండు రోజుల్లో బాగుచేయిస్తాం



మండల కేంద్రంలో దాతల సహాయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వాటిలో కొన్ని వినియోగంలో ఉన్నాయి. కోతుల బెడద కారణంగా పలు సీసీ కెమెరాలు పని చేయడం లేదు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించాం. సోమవారం పనులు ప్రారంభించి రెండురోజుల్లో పరిష్కరిస్తాం.

– నరేందర్, ఎస్‌ఐ, మాగనూర్

మరమ్మతుకు నోచుకోని రోడ్డు



గుంతలమయంగా మారిన ఉజ్జెల్లి రోడ్డు

మాగనూర్: నిత్యం పదుల సంఖ్యలో మాగనూర్, ఉజ్జెల్లి ప్రధాన రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటారు. ఆ రోడ్డు వర్షాలకు కుంగిపోవడంతో పాటుగా సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ బ్యాక్‌వాటర్ నుంచి వ్యవసాయ పొలాలకు నీటి పంపింగ్ కోసం అడ్డగోలుగా రోడ్డు తవ్వకాలు చేయడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. రోడ్డుకు మరమ్మతు చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు అనేకమార్లు విన్నవించినా అధికారులు స్పందించడం లేదని వాహనదారులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే గుంతల వల్ల అనేక మంది ప్రమాదానికి గురయ్యారని, ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు.

పీఈటీల సమస్య పరిష్కారమే ధ్యేయం



ఓటు అభ్యర్థిస్తున్న తపస్ నాయకులు

నారాయణపేట రూరల్ : నిలిచిపోయిన పీఈటీల ఉన్నతీకరణ ప్రక్రియ పూర్తి చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వారి సమస్య పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని తపస్ జిల్లా అధ్యక్షులు శేర్‌కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో టీచర్ల ఇంటింటికి తిరుగుతూ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించి బీజేపీ అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఏవీఎన్‌రెడ్డిని మండలికి పంపిస్తే తన గళంతో విద్యావ్యవస్థలో మార్పుకు కృషిచేస్తారని అన్నారు. సీపీఎస్ రద్దు, జీఓ 317 బాధితులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో నర్సింహా, గుంపుబాలరాజు, సీతారాములు, విశ్వనాథ్‌రెడ్డి, శంకర్‌నాయక్, చిన్న నర్సింహులు, వెంకట్‌రెడ్డి, సాకరవి, పీఈటీలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు



ధన్వాడ మండల కేంద్రంలోని కల్వర్టు

ధన్వాడ: నారాయణపేట నుంచి ధన్వాడ మీదుగా హైదరాబాద్ వేళ్లే ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా ఉందని గ్రామస్తులు అంటున్నారు. వెంటనే నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ధన్వాడ సబ్‌స్టేషన్ నుంచి లింగంపల్లి గ్రామం వరకు నూతన బీటీ రోడ్డును ఆదివారం వేశారు. కానీ మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో ఉన్న కల్వర్టు నిర్మించకుండా వదిలేశారని ఆరోపించారు. రాత్రి సమయంలో రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తే ప్రమాదం చోటు చేసుకునే అవకాశం ఉందని అంటున్నారు. గతంలో ప్రమాదాలు జరిగాయని వాపోతున్నారు. నూతన రోడ్డు వేసిన అధికారులు కల్వర్టు ఎందుకు నిర్మించడంలేదని ప్రశ్నిస్తున్నారు. విషయంపై అధికారులకు ఎన్నిసార్లు విన్నంచినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి'



మాట్లాడుతున్న నాయకులు

ఊట్కూరు: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా పాటుపడుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ అత్తర్ కమాల్ అన్నారు. ఊట్కూరులో ఆదివారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ ప్రతిష్టతకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని మండలాల్లో పార్టీ ప్రతిష్టతకై సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. రాబోయే ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. గత ఎన్నికల్లో ఊట్కూరు మండలంలో పార్టీ ఆధ్వర్యంలో పోటీ చేసి పలు స్థానాల్లో గెలుపొందినట్లు వివరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ వసీం, నాయకులు వాయిద్ ఉస్సేన్, కలీద్, అబ్జల్, ఇంతియాజ్, హారీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిరుపేదల కష్టాలను తీరుస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 12, 26వ వార్డుల్లో ఆదివారం హాత్‌సే హాత్ జోడోయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకు తిరుగుతూ ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. కొత్వాల్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమం కోసం చేపట్టనున్న కార్యక్రమాల గురించి వివరించడానికి హాత్‌సే హాత్ జోడో యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనతో ప్రజలు విసుగు చెందారన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్‌సిలిండర్ ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తుందన్నారు. కాంగ్రెస్ హయాంలో రూ.400 గ్యాస్ ధర ఉంటే ఇప్పుడు రూ.1150కి చేరిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500లకు గ్యాస్ సిలిండర్ అందజేస్తామని, ఏకకాలంలో రూ.2లక్షల రైతు రుణమాఫీ, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, నాయకులు చంద్రకుమార్‌గౌడ్, జహీర్, అక్బర్, వసంత, సీజే బెనహర్, బెక్కరి మధుసూదన్ పాల్గొన్నారు.

స్నేహితురాలికి చేయూత

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని 2000–2001 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు రాంపూర్‌కు చెందిన తమ స్నేహితురాలు గీత భర్త రవి అనారోగ్యానికి గురికావడంతో స్నేహితులంతా కలిసి వైద్యఖర్చుల కోసం రూ.40వేలు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సువర్ణ, సుస్మిత, రాఘవేందర్ చారీ, రామస్వామి, వేణు చారీ, రఘువీర్ యాదవ్, ఆనంద్, బాలకృష్ణ, తిరుపతి, రాము, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా పేకాట!

మాగనూర్: మండల కేంద్రంలోని చిన్న వాగు పరిసర ప్రాంతాలల్లో పేకాట జోరుగా సాగుతోందని స్థానికులు అంటున్నారు. యువకులు పేకాటకు బానిసలుగా మారి జేబులు ఖాళీ చేసుకుంటున్నారని, పేకాట కోసం అప్పులు సైతం చేస్తున్నారని చెబుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో పేకాట రాయుళ్లకు అడ్డు అదుపు లేకుండా పోతోందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

ధన్వాడలో వైద్యశిబిరం ఏర్పాటు



పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ధన్వాడ: మండల కేంద్రంలోని బస్‌స్టాండ్‌లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. మహబూబ్‌నగర్ సోలార్‌పార్కు లిమిటెడ్ సౌజన్యంతో అస్రా సామాజిక్‌లోక్ కల్యాణ్ సమితి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. దాదాపు 200 మందికి పరీక్షలు చేయించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నాగేష్, ఉమేషదేష్‌ముఖ్, ఫీల్డ్ ఆఫీసర్ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

కృష్ణా: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మైనారిటీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి ఒకే ఒక్క యూనిట్ ఉందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన సభ్యులు అందరు సకాలంలో హాజరుకావాలని కోరారు.

కృష్ణానది నుంచి ఇసుక రవాణా

కృష్ణా: మండలంలోని ముడుమాల్ గ్రామంలో కృష్ణానది నుంచి నిత్యం రాత్రి సమయంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని ఆ గ్రామ ప్రజలు ఆదివారం విలేకరులకు తెలియచేశారు. గ్రామంలోని కొందరు అక్రమార్కులు ట్రాక్టర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. విషయంపై అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని అంటున్నారు.అదే విధంగా నదిఒడ్డున ఉన్న ప్రభుత్వ భూమి నుంచి మొరం(మట్టి)ను ఇతర గ్రామాలకు తరలిస్తున్నారని అన్నారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని అన్నారు.

మండల అధ్యక్షుడిగా వెంకటయ్య

కోయిల్‌కొండ: ముదిరాజ్ సంఘం మండల నూతన కమిటీని ఆదివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. అధ్యక్షుడిగా వెంకటయ్య, ఉపాధ్యక్షుడిగా ఇరారాం వెంకట్రాములును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వెంకటయ్య మాట్లాడుతూ ముదిరాజ్ సామాజికవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గోపాల్, నారాయణ, మడుగు వెంకటయ్య, వేణు, మొగులయ్య, వీరన్న, చిన్న, కొండయ్య, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం



మక్తల్‌లో సైక్లింగ్ చేస్తున్న విద్యార్థులు

మక్తల్: నిత్యం సైక్లింగ్ చేస్తే ఆరోగ్యంగా ఉండవచ్చని డాక్టర్ రమ్యశ్రీ అన్నారు. ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలన్నారు. ఆదివారం మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 4వవార్డులో కౌన్సిలర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో సైక్లింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో రాంమాధవ్, పద్మ, రాధ విద్యార్థులు పాల్గొన్నారు.

మానవులంతా సమానమే

కృష్ణా: కుల, మత ప్రాంతాలకు అతీతంగా విశ్వ మానవాళికి జయం కలాగాలని, మానవులంతా సమానమే అని ఆది జగత్ గురు రేణుకాచారి నినదించారని క్షీరాలింగ మహాస్వామి అన్నారు. ఆదివారం రేణుకాచారి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వీరశైవులు ఆర్టీసీ సిద్ధయ్యస్వామి, సురేష్‌స్వామి, బన్నయ్యస్వామి, కుమార్‌స్వామి, గిరీష్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కరాటే నేర్చుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న కొండయ్య

మక్తల్: విద్యార్థులు కరాటే నేర్చుకోవాలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు కొండయ్య అన్నారు. ఆదివారం మక్తల్‌లో డ్రాగన్ షాటోకాన్ కరాటే డు ఇండియా వారి ఆధ్వర్యంలో కరాటే నిర్వహించారు. కరాటే నేర్చుకోవడం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని అన్నారు. వ్యవస్థాపకుడు సలాబిర్ ఉమర్‌ను అభినందించారు. మాజీ ఎంపీటీసీ వెంకటేష్, రహీం పటేల్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు రుణాలు అందించాలి



వినతిపత్రం అందిస్తున్న యువ నాయకులు

నర్వ: మండల సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) ద్వారా రుణాలు అందించాలని పీఏసీఎస్ చైర్మన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి యువకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సహకార సంఘం ద్వారా యువత ఉన్నత చదువుల కోసం ఎడ్యుకేషన్ లోన్స్, హౌసింగ్ లోన్స్, ఉపాధి పొందడానికి వ్యాపార సంబంధ రుణాలను ఇచ్చి ఆర్థికంగా బలోపేతం చేయాలని కోరారు. స్పందించిన చైర్మన్ త్వరలో రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో యాంకి జనార్దన్‌రెడ్డి, జక్కన్నపల్లి రామన్‌గౌడ్, లంకాల్ జనార్దన్, నర్వ అజిత్‌సింహారెడ్డి తదితరులున్నారు.

ప్రారంభమైన బీటీరోడ్డు పనులు



సాగుతున్న బీటీ రోడ్డు పనులు

ధన్వాడ: మండలంలోని కంసాన్‌పల్లి నుంచి యంనోనిపల్లి గ్రామం వరకు నూతన బీటీ రోడ్డు పనులు ఆదివారం ప్రారంభించారు. నాలుగు సంవత్సరాల క్రితం ప్రభుత్వం బీటీ రోడ్డును మంజూరు చేసింది కానీ గుత్తేదారుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో పనులు సాగలేదు. కొనిసార్లు గ్రామస్తులు డబ్బులు వేసుకొని మట్టి వేయించారు. ప్రస్తుతం అధికారులు ఎట్టకేలకు పనులు ప్రారంభించడం పై హర్షం వ్యక్తం చేశారు. ఇందులో సచిన్, కాశిమన్న, నారాయణ, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

పట్ట పగలే విద్యుత్ దీపాల వెలుగులు



వర్కూర్‌లో పగలే వెలుగుతున్న విద్యుత్ బల్బు

మాగనూర్: మండలంలోని పలు గ్రామాల్లో పట్టపగలు కూడా విద్యుత్ దీపాలు వెలుగులను విరజిమ్ముతున్నాయి. నిరంతరాయంగా బల్బులు వెలగడంతో విద్యుత్ వృథా అవుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వడ్వాట్, అమ్మపల్లి, గజ్జరందొడ్డి, మందిపల్లి, నెరడగందొడ్డి, కొత్తపల్లి, వర్కూర్, నేరడగం, మాగనూర్ తదితర గ్రామాల్లోని పలు కాలనీల్లో 24 గంటల పాటు విద్యుత్ దీపాలు వెలుగుతున్నా సంబంధిత అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సాయంత్రం వేళల్లో వీధి దీపాలను ఆన్ చేసి ఉదయం వేళల్లో బంద్ చేయాల్సి ఉన్నప్పటికీ, ఆ దిశగా అధికారులు, ట్రాన్స్‌కో అధికారులు కానీ చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు అంటున్నారు. దీంతో గ్రామ పంచాయతీలకు విద్యుత్ బిల్లులు అధికంగా వచ్చి ప్రజాధనం వృథాగా పోతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

కుండల రక్షణపై సీఐకి వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలో సోమవారం, మంగళవారం హోలీ పండుగ సందర్భంగా స్థానిక కుమ్మరివాడలోని కుండలకు రక్షణ కల్పించాలని కోరుతూ శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సీఐ రవిబాబుకు శాలివాహన వినతి పత్రం అందించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు దత్తు మాట్లాడుతూ కుమ్మరివాడలో తాము బహిరంగ ప్రదేశాల్లో కుండలు తయారు చేసి పెట్టామని, హోలీ పండగ సందర్భంగా రాత్రి వేళలో కుండలను అల్లరి ముక్కలుగా ధ్వంసం చేసే అవకాశం ఉందన్నారు. అలా జరిగితే ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. వినతిపత్రం అందించిన వారిలో సంఘం నాయకులు తిరుపతి, ఆశన్న, రాములు,సాయన్న, మల్లేష్ తదితరులు ఉన్నారు.

పీఆర్‌టీయూ ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు



మరికల్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్ : స్థానికత పేరుతో 317జీఓతో టీచర్లకు జరిగిన నష్టాన్ని రాబోవు మూడేళ్లలో ప్రతి ఒక్కరికి న్యాయం చేయడానికి పీఆర్‌టీయూ సంఘం కృషిచేస్తుందని జిల్లా అధ్యక్షులు నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం మద్దూర్, నారాయణపేట, మరికల్ మండలాల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, కతలప్ప, బాలరాజు పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రంలోని ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని నాయకులు ఆదివారం ప్రచారం చేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సదన్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డిలు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసే ఏకైక సంఘం పీఆర్‌టీయూ అన్నారు. 317 జీవో వల్ల నష్టపోయిన ప్రతి ఉపాధ్యాయునికి న్యాయం చేసే బాధ్యత తమదేన్నారు. సీపీఎస్ రద్దు విషయాన్ని కూడా రాష్ట్ర నాయకులు ప్రభుత్వంతో చర్చలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు లక్ష్మారెడ్డి, అనిల్‌కుమార్, మహేష్‌కుమార్ పాల్గొన్నారు.